# భయం

గోపీ అప్పుడే రైలు దిగాడు. అతని తల్లి చనిపోయి ఎక్కువ రోజులు కాలేదు. చనిపోయేముందు "తమ్ములున్నారు బాబూ! చెల్లెలికి ఎటువంటి సంబంధం తెస్తావో!" అని తల్లి చెప్పిన మాటలు ఇంకా చెవుల్లో గింగురుమంటూనే వున్నై.

అమ్మ పోయిన్నాటి రాత్రి, అంతా గొల్లున ఏడుస్తుంటే, "ఎందు కన్నయ్యా!" అని అడిగాడు పెద్దతమ్ముడు.

"వాళ్ళకు పిచ్చెత్తింది. వాళ్ళెప్పుడూ అంతే" అని చెప్పాడు గోపీ.

గోపీ పెద్దతమ్ముడు చిన్నతమ్ముణ్ని అడిగాడు—"అమ్మేదిరా?"

వాడు ఆకాశంవైపు చూపించాడు. అందులో గోపీకి వేదాంతం కనిపించింది. అమ్మ చచ్చిపోలేదు. చచ్చిపోయింది మనం. ఈ లోకమంతా చచ్చిపోయింది. ఈ చచ్చిన లోకంలోనుంచి అమ్మ బతికింది.

కాని ఆ రాత్రి మాత్రం గోపీకి ప్రపంచం ఎడారిగా, శూన్యంగా, వల్లకాడుగా, భయంకరంగా కనిపించింది.

ఇన్నీ జ్ఞాపకంవచ్చి, ఎరిగినవాళ్ళుగానీ, స్నేహితులుగానీ కనిపించి "మీ అమ్మకు ఎట్లావుంది?" అని అడుగుతారేమోనని భయం వేసింది గోపీకి.

* * * *

"కూలీ!" అని పిలిచాడు.

"బాబూ"

"పెట్టె తీసుకురా"

"ఎక్కడకు బాబూ?"

పేట పేరు చెప్పాడు గోపీ.

"అణా బాబూ"

"బేడా ఇస్తా, నాతో రా."

పెట్టె కూలివాడి నెత్తిమీద పెట్టి పరధ్యానంగా బయల్దేరాడు గోపీ. కూలీ గోపీవెనక అడుగుల్లో అడుగులు వేసుకుంటూ వెళ్తున్నాడు.

వర్షం కురవటానికి ప్రయత్నిస్తూవుంది. సూర్యుడు నాశనమైన చీకట్లో నక్షత్రాలు మెరుస్తున్నయి. గోపీ కూలీ పిల్లవాడితో సంభాషణ మొదలు పెట్టాడు.

"రోజుకి ఎంతొస్తుందిరా?"

"అర్ధణో, అణో వస్తుందండి!"

"దాన్తో ఏం చేస్తావ్?"

"కొనుక్కు తింటాను."

"ఇంటికగ్గర ఇవ్వవూ?"

"నాకు అమ్మా బాబూ లేరండి? ఉంటే అట్లాగే ఇచ్చేవాణ్ణి."

"మరి నీకు పొట్ట ఎలాగురా గడవటం?"

"ఇక్కడ ఒక పోర్టరుకాడ వుంటున్నానండీ. ఆయన ఇంట్లో పని చేసిపెడతాను. అన్నం పెడతాడు. రైలొచ్చినప్పుడు ఇట్లా కూలీ మోస్తుంటాను. ఏ అణో వొస్తేకొనుక్కు తింటాను. రాత్రిపూట రైలు స్టేషన్లో పడుకుంటానండీ...."

"ఎంత హాయి బతుకురా" అనుకున్నాడు గోపీ. కాని అప్పట్నుంచీ ఆ పిల్లవాణ్ణి చూస్తే గోపీకి భయం.